ప్రజల వద్దకే ప్రభుత్వ పాలన

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు
- తాళ్లబురిడిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం

పార్వతీపురంటౌన్: ప్రజల వద్దకే పాలనను అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీయేనని ఎమ్మెల్యే జోగారావు అన్నారు.ఈ మేరకు పార్వతీపురం మండలంలోని తాళ్లబురిడి సచివాలయం పరిధిలో సోమవారం నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని, సంక్షేమ అభివృద్ధి పథకాల లబ్ధిని తెలియచేసే డిస్ ప్లే బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామం పరిధిలో అభివృద్ధికోసం రూ.13.33 కోట్లు నిధులు వెచ్చించామన్నారు. ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందేందుకు పూర్తిగా దోహద పడడమే కాకుండా అన్ని వర్గాల ప్రజలకు చేదోడు వాదోడుగా నిలిచి, ప్రజలందరి మద్దతు పొందుతూ పేదవాడి మనసు గెలుచుకున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డేనని స్పష్టం చేశారు. ఇన్ని సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేసి సామాజిక సమతుల్యతను తీసుకువస్తూ పేద, బడుగు, బలహీన వర్గాలకు అన్ని విధాలుగా అండగా నిలుస్తున్నారు కనుకనే మళ్లీ సీఎంగా రాష్ట్రానికి జగనే కావాలన్నారు. సచివాలయం పరిధిలో గల అన్ని గ్రామాల ప్రజానీకం వచ్చే ఎన్నికలలో పూర్తి మద్దతును జగన్ మోహన్ రెడ్డికి తెలిపి మళ్లీ సీఎంగా గెలిపించే బాధ్యత తీసుకోవాలని కోరారు. అనంతరం గ్రామంలో ప్రజల సమస్యలను తెలుసుకుని వారు అడిగిన సమస్యలకూ సావధానంగా సమాధానాలు చెపుతూ వేదిక వద్దనే సంబధిత అధికారులను ఆదేశించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బలగ రేవతమ్మ, ఎంపీపీ మజ్జి శోభారాణి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, వైస్ ఎంపీపీ బంకురు రవికుమార్, స్థానిక సర్పంచ్ చప్ప రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ జిల్లా జనరల్ సెక్రటరీ వి.గురురాజు, జేసీఎస్ కన్వీనర్ బి.వాసుదేవరావు, పార్టీ నాయకులు బలగ నాగేశ్వరరావు, మువ్వల సత్యంనాయుడు, కోఆప్షన్ ఎంపీటీసీ షేక్ కరీమ్, మున్సిపల్ సిబ్బంది, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు, సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


పార్వతీపురం టౌన్: వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జోగారావు


పార్వతీపురం టౌన్: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంలో వై ఏపీ నీడ్స్ జగన్

పట్టణంలోని జగన్నాథపురం సచివాలయం-2 పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సచివాలయ పరిధిలో రూ. 22.53 కోట్లతో అభివృద్ధి చేపట్టామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగారావు ప్రజలకు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరీ, వైస్ చైర్మన్లు కొండపల్లి రుక్మిణి, యిండుపూరు గున్నేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, స్థానిక కౌన్సిలర్లు ఎడ్ల త్రినాథ, రణభేరి చిన్నంనాయుడు, బంగారునాయుడు, జేసీఎస్ కన్వీనర్ గొర్లి మాధవరావు, పార్టీ జనరల్ సెక్రటరీ వి.గురురాజు తదితరులు పాల్గొన్నారు.

మరో అవకాశం ఇవ్వాలి...


మక్కువ: సంక్షేమ పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి మరో అవకాశం ఇవ్వాలని జెడ్పీటీసీ సభ్యుడు మావుడి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మావుడి రంగునాయుడు కోరారు. మండలంలోని శంబరలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు , సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

జగనే ముఖ్యమంత్రిగా కొనసాగాలి..

సాలూరు: రాష్ట్రంలో కొనసాగుతున్న సంక్షేమ పరిపాలన కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించుకోవాలని వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్, జేసీఎస్ మండల కన్వీనర్ కర్లేపల్లి త్రినాథ, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు సువ్వాడ భరత్‌శ్రీనివాస్ అన్నారు. మండలంలోని బోరబంద సచివాలయం పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయ పరిధిలోని ప్రజలకు అందించిన వివిధ సంక్షేమ పథకాల వివరాలను రూపొందించిన డిస్‌ప్లే బోర్డు, పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జెగన్ మోహన్‌రెడ్డి అత్యంత పారదర్శకంగా పాలన సాగిస్తున్నారని కొనియాడారు. రానున్న ఎన్నికల్లో జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పార్వతి, సర్పంచ్ బంకురు తిరుపతినాయుడు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.


మక్కువ: సంక్షేమం, ప్రగతిని వివరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు శ్రీనివాసరావు, రంగునాయుడు


సీతానగరం: సంక్షేమపథకాల డిస్‌ప్లేను ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ ఎం బాబ్జీ, వైఎస్సార్‌సీపీ మండల సీనియర్ నాయకుడు శ్రీరాములునాయుడు, పార్టీ మండల అధ్యక్షుడుబి చిట్టిరాజు


బలిజిపేట: తుమరాడలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించిన వైఎస్సార్‌సీపీ బలిజిపేట మండల అధ్యక్షుడు మురళీకృష్ణ


సాలూరు: బోరబందలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

క్లుప్తంగా

సమన్వయంతో పనిచేయాలి


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరావు

మక్కువ: సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు సమన్వయంతో పనిచేసి సచివాలయ వ్యవస్థ గొప్పతనాన్ని ప్రజలకు చాటి చెప్పాలని ఎంపీపీ పారమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు మావుడి శ్రీనివాసరావు సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ సీహెచ్ సూర్యనారాయణ ఆధ్వర్యంలో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ పారమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు మావుడి శ్రీనివాసరావు మాట్లాడుతూ, ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న నవరత్నాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత మీపై ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మావుడి రంగునాయుడు, మోడల్ ఆఫీసర్ దేవకుమార్, తదితరులు పాల్గొన్నారు.

బీమా పరిహారం అందజేత


బాధితురాలు పుష్పలతకు వైఎస్సార్ బీమా నగదు అందిస్తున్న రంగునాయుడు

మక్కువ: మండల కేంద్రానికి చెందిన ఎర్ర బంగార్రాజు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ మేరకు వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద మంజూరైన రూ. పది వేలను బంగార్రాజు భార్య పుష్పలతకు వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మావుడి రంగునాయుడు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ రౌతు సతీష్, తదితరులు పాల్గొన్నారు.

ఐక్య క్రిస్మస్ వేడుకలను విజయవంతం చేయండి

బలిజిపేట: ఈనెల 14వ తేదీన బలిజిపేట మండలంలోని తుమరాడలో నిర్వహించనున్న ఐక్య క్రిస్మస్ వేడుకలను విజయవంతం చేయాలని నిర్వాహక అధ్యక్షుడు మన్మథరావు కోరారు. తుమరాడలో క్రైస్తవ ప్రార్థనా సహవాస మందిరం వద్ద బలిజిపేట మండల పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి పలువురు పెద్దలు హాజరుకానున్నారని, సోదరులంతా హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

ఓటింగ్ ప్రక్రియపై అవగాహన


మామిడిపల్లిలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

సాలూరు: ఓటింగ్ ప్రక్రియపై రెవెన్యూ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. తహసీల్దార్ బాలమురళీకృష్ణ ఆధ్వర్యంలో మండలంలోని మామిడిపల్లి, కరాసవలస, అన్నంరాజువలస, మరిపల్లి, కందులపథం, తదితర పంచాయతీల్లో సోమవారం అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈవీఎంలలో ఓటు ఎలా వేయాలి.. ఆ ఓటు ఎలా నమోదవుతున్నదీ వివరించారు.

14మంది జూదరులపై కేసు నమోదు

పార్వతీపురంటౌన్: 14మంది జూదరులపై కేసు నమోదు చేసినట్లు పార్వతీపురం రూరల్ ఎస్సై దినకర్ తెలిపారు. ఆదివారం రాత్రి పార్వతీపురం మండలంలోని అడ్డాపుశీల పరిసరాల్లో జూదం ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించి రెండు బృందాల నుంచి రూ.14,480 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ రెండు బృందాలకు చెందిన 14మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు చెప్పారు.

లింగ వివక్షను విడనాడాలి

- ఎంపీడీఓ పార్వతి


మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ర్యాలీ

సాలూరు: లింగ వివక్షను విడనాడాలని ఎంపీడీఓ పార్వతి అన్నారు. మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మండలంలోని పెదబోరబంద సచివాలయం వద్ద సోమవారం నిర్వహించిన జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేక జాతీయ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సమాజంలో పురుషులు, స్త్రీలు అన్ని రంగాల్లో సమానంగా ముందుకు వెళ్తున్నారని వివరించారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం సింహాచలం, సీసీలు, పంచాయతీ సెక్రటరీలు కిరణ్‌కుమార్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రా విజయవంతం కావాలి

సీతానగరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను విజయవంతం చేయడానికి వ్యాయామ ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ కోరారు. ఈ మేరకు సోమవారం ఎంఈఓలు జి సూరిదేముడు, ఎస్ వెంకటరమణ ఆధ్వర్యంలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమ సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ మాట్లాడుతూ మండలంలోని అన్నిగ్రామాల్లో ఈనెల 15 నుంచి ప్రారంభం కానున్న ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీల్లో పాల్గొనే యువతీయువకుల పేర్లు నమోదును బట్టి సచివాలయాల పరిధిలో పోటీలు ఉత్సాహంగా నిర్వహించడానికి వాయామ ఉపాధ్యాయులు దృష్టి సారించాలని కోరారు.ఇప్పటికే క్రీడా సామగ్రిని సంబంధిత సచివాలయాలకు పంచాయతీ కార్యదర్శుల ద్వారా పంపిణీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కె.కుమార వర్మ, బూర్జ, నిడగల్లు, ఆర్.వెంకంపేట, గాదెలవలస, సీతానగరం, మరిపివలస ఉన్నత పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రా మెటీరియల్ పంపిణీ


బలిజిపేట: సచివాలయ సిబ్బందికి మెటీరియల్ అందిస్తున్న ఎంపీడీఓ విజయలక్ష్మి, ఎంఈఓ సామల సింహాచలం

బలిజిపేట: మండలంలోని సచివాలయాల పరిధిలో నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి సంబంధించిన మెటీరియల్‌ను ఎంపీడీఓ విజయలక్ష్మి, ఎంఈఓ సామల సింహాచలం సోమవారం పంపిణీ చేశారు. ఈనెల 15వ తేదీ నుంచి ప్రారంభం కానున్న కార్యక్రమానికి అవసరమైన మెటీరియల్‌ను వారికి అందజేశామని ఎంపీడీఓ విజయలక్ష్మి ఈ సందర్భంగా తెలిపారు. ఈ పోటీలలో యువత పాల్గొని క్రీడారంగ ప్రాధాన్యాన్ని అందరికీ తెలియపరచాలని పిలుపునిచ్చారు.

రక్తహీనత నివారణకు జాగ్రత్తలు పాటించాలి

- పీహెచ్‌సీ డాక్టర్ పావని
- 48 మంది గర్భిణులకు తనిఖీ

సీతానగరం: గర్భిణులకు ప్రభుత్వం ఆరోగ్య భద్రత కలిస్తూ అవసరమైన పౌష్టికాహారం, అత్యాధునిక వైద్యసేవలు అందుబాటులోకి తెచ్చిందని సీతానగరం పీహెచ్‌సీ డాక్టర్ పావని అన్నారు. ఈ మేరకు సోమవారం ఆమె స్థానిక పీహెచ్‌సీలో డాక్టర్ ఉషారాణితో కలిసి 48 మంది గర్భిణులకు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పావని మాట్లాడుతూ గర్భిణులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే సుఖమైన ప్రసవానికి అవకాశం ఉందన్నారు. ఎక్కువమంది గర్భిణుల్లో ఐరన్ లోపం ఉందని గుర్తించినట్లు తెలియజేశారు. అంగన్వాడీ కేంద్రాల్లో ఇస్తున్న పౌష్టికాహారాన్ని విధిగా తీసుకోవాలని ప్రతినెలా ప్రభుత్వ ఆస్పత్రుల్లో తనిఖీ చేయించుకుని ఆరోగ్యవంతంగా ఉండాలని సూచించారు.


పీహెచ్‌సీలో గర్భిణులను తనిఖీ చేస్తున్న డాక్టర్ పావని

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

- ఎంపీపీ ప్రమీల

పాచిపెంట: మండల పరిషత్ కార్యాలయంలో ఏపీ ఎస్ఐఆర్‌డీపీఆర్ ఆధ్వర్యంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రీఫ్రెష్ శిక్షణ కార్యక్రమాన్ని ఎంపీపీ బద్నాన ప్రమీల సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, భారతదేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. ఈ పథకాలు అందించే క్రమంలో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు కొంత మేరకు ఒత్తిడికి గురవుతున్నారని ఆ ఒత్తిడిని అధిగమించేందుకు సచివాలయ సిబ్బందికి, వలంటీర్లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కోరిపల్లి రవీంద్రనాథ్, పాచిపెంట వీరంనాయుడు, దండి ఏడుకొండలు, ఎంపీడీఓ లక్ష్మీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

పట్టాల పంపిణీ వేగవంతం

- ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర


అధికారులతో మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: పట్టాల పంపిణీ ప్రక్రియ వేగవంతం చేయాలని ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి పీడిక రాజన్నదొర ఆదేశించారు. సోమవారం పట్టణంలోని తన స్వగృహం వద్ద పాచిపెంట మండలానికి సంబంధించి తహసీల్దార్ శేఖర్, హౌసింగ్ డీఈ సోమేశ్వరరావులతో రెవెన్యూ, హౌసింగ్ అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఇంతవరకు ఎంతమందికి పట్టాలు పంపిణీ చేశారు... ఇంకా ఎంతమందికి పంపిణీ చేయాల్సి ఉంది.. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మంజూరు చేయనున్న పట్టాలు..ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలపై మంత్రి ఆరా తీశారు. కొటికిపెంటలో 283 మందికి పట్టాలు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. అలాగే కొటికిపెంటలో 45 ఇళ్లు మంజూరయ్యాయని, మరో 190 ఇళ్లు మంజూరు కానున్నాయని హౌసింగ్ డీఈ మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. అధికారులు అంకితభావంతో పనిచేయాలని మంత్రి రాజన్నదొర సూచించారు.

నేడు ఉచిత నేత్ర వైద్యశిబిరం

పార్వతీపురం: పట్టణంలోని లయన్స్ క్లబ్‌లో మంగళవారం ఉదయం 9 గంటలనుంచి ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు హెల్త్, మెడికల్ క్యాంప్ చైర్మన్ లయన్ డాక్టర్ యాళ్ల వివేక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయనగరంలోని శ్రీ వేంకటేశ్వర పుష్పగిరి కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ శిబిరంలో కంటి సమస్యలున్న వారికి తనిఖీలు నిర్వహించడంతోపాటు అవసరమైన వారికి పుష్పగిరి ఆస్పత్రిలో ఆపరేషన్ చేయనున్నట్లు తెలిపారు. శిబిరానికి వచ్చినవారు ఆధార్‌కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు తప్పనిసరిగా తీసుకుని రావాలని స్పష్టం చేశారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం

పాచిపెంట: మండలంలోని పనుకువలస పంచాయతీ చిన చీపురువలస సమీపంలో ఉన్న పారమ్మ కొండపై శివపార్వతుల కల్యాణాన్ని సుబ్బు గురువు ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం భారీ అన్న సమారాధన చేపట్టారు. ఈ సందర్భంగా శివ నామస్మరణతో పారమ్మకొండ మార్మోగింది.

బస్సులు తగ్గించడంతో ఇబ్బందులు..

- మంత్రి రాజన్నదొరుకు సమస్యలు విన్నవించిన ప్రజా ప్రతినిధులు

సాలూరు: పట్టణంలోని డిపో నుంచి విశాఖపట్నం, రావులపాలెం, విజయవాడ, ఒడిశా వంటి సుదూర ప్రాంతాలకు వెళ్లే బస్సుల సంఖ్య తగ్గించడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని పలువురు కౌన్సిలర్లు, నాయకులు, ప్రజలు తెలిపారు. ఈ మేరకు మంత్రి పీడిక రాజన్నదొరను సోమవారం ఆయన నివాసంలో కలిసి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. బస్సుల సంఖ్య తగ్గించడంతో పాటు కండీషన్‌లో ఉన్న బస్సులను వేరే డిపోలకు తరలిస్తున్నారని కౌన్సిలర్లు తెలిపారు. దీనిపై ఉప ముఖ్యమంత్రి స్పందిస్తూ ఈ విషయమై ఆర్టీసీ డిపో మేనేజర్, రీజనల్ మేనేజర్, జిల్లా రవాణాధికారుల వివరణ కోరుతానన్నారు. అవసరమైతే విషయాన్ని రవాణా మంత్రి విశ్వరూప్, సీఎం జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. ప్రజలకు సుఖవంతమైన, సురక్షితమైన ప్రయాణం అందించాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి లక్ష్యాలకు తూట్లు పొడిచేలా ఎవరైనా అధికారులు వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. గతంలో సాలూరు డిపోను ఎత్తివేయాలని ప్రయత్నించగా.. తాము అడ్డుకున్నామని గుర్తు చేశారు. ప్రయాణికులకు ఇబ్బందులు కలిగించి తద్వారా ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకువచ్చే అధికారులపై తప్పకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, కౌన్సిలర్లు, నాయకులు గిరి రఘు, వెంకటరమణ, లక్ష్మణరావు, అప్పలస్వామి, బాలాజీ, సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.


ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొరకు వినతిపత్రం అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

ఇంటింటి కుళాయి పనులు వేగవంతం

సీతానగరం: జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా కోట్లాది రూపాయల వ్యయంతో సీతానగరం మండలంలో జరుగుతున్న ఇంటింటి కుళాయిల పనులు వేగవంతంగా చేపట్టి నిర్దేశించిన గడువులోగా పూర్తి చేస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆర్.పవన్‌కుమార్ అన్నారు. ఈ మేరకు మండలంలోని చినభోగిలిలో రూ.24 లక్షల వ్యయంతో జరుగుతున్న ఇంటింటి కుళాయిల పనులను సోమవారం ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని అంటిపేట సచివాలయం పరిధిలో గల మూడుగ్రామాలు, గెడ్డలుప్పి సచివాలయం పరిధిలో రెండుగ్రామాలు గాదెలవలస సచివాలయం పరిధిలో మూడు గ్రామాలు, ఆర్.వెంకంపేట సచివాలయం పరిధిలో రెండు గ్రామాల్లో ఇంటింటి కుళాయి పనులు పూర్తయినట్లు తెలియజేశారు. లచ్చయ్యపేట సచివాలయం పరిధిలో రెండు గ్రామాలు, బగ్గందొర వలస సచివాలయం, పెదంకలాం, తామరఖండి,పెద బోగిలి, లక్ష్మీపురం, వెంకటాపురం సచివాలయాల పరిధిలో గ్రామాలకు ఇంటింటి కుళాయిల పనులు పూర్తి కావచ్చాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కె రాధ, సచివాలయ కన్వీనర్ కె శ్రీనివాసరావు, ఎంపీటీసీ జి బుజ్జి, మాజీ ఎంపీటీసీ వెంకటనాయుడు, ఇంజినీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.


చినభోగిలిలో జరుగుతున్న కుళాయి పైప్‌లైన్ పనులు

ఎస్ఏ-1 పరీక్షల ప్రారంభం

సీతానగరం: మండలంలోని ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల్లో సోమవారం ఎస్ఏ-1 పరీక్షలు ప్రారంభించినట్లు ఎంఈఓ జి.సూరిదేముడు తెలిపారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఉన్నత పాఠశాలల్లో మధ్యాహ్నం 9వ తరగతి విద్యార్థులకు పీఎస్ పరీక్షలు,7వ తరగతి విద్యార్థులకు జరిగిన జగనరల్ సైన్స్ పరీక్షలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలు రాయడానికి అవసరమైన మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పించిందని చెప్పారు. జిల్లా విద్యాశాఖ అధికారి పర్య వేక్షణలో మండలంలోని అన్ని ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులతో పాటు ఉన్నత పాఠశాలల విద్యార్థులకు పరీక్షలు జరిగినట్లు తెలియజేశారు. పరీక్షలు జరిగిన సమయంలో పరీక్షల్లో పాల్గొనాల్సిన వారు సమయానికి హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సహోపాధ్యాయులు పాల్గొన్నారు.


పరీక్షా కేంద్రంలో మాట్లాడుతున్న ఎంఈఓ జి.సూరిదేముడు

క్రీడా కిట్ల పంపిణీ

పాచిపెంట: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి సంబంధించి మండల కేంద్రానికి చేరుకున్న క్రీడా కిట్లను ఎంపీపీ బద్నాన ప్రమీల సోమవారం ఆయా పంచాయతీల కార్యదర్శులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, యువతలో ఉండే క్రీడా నైపుణ్యాన్ని వెలుగు తీయాలని ఉద్దేశంతో ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

శంభో శంకర..!

- శివనామస్మరణతో మార్మోగిన శైవ క్షేత్రాలు
- పోటెత్తిన భక్తులు


ప్రత్యేక అలంకరణలో పశుపతినాథుడు

పార్వతీపురంటౌన్: పవిత్ర కార్తీకమాసం నాల్గవ సోమవారం పార్వతీపురం నియోజకవర్గ వ్యాప్తంగా శివనామస్మరణతో శైవ క్షేత్రాలు మార్మోగాయి. ఈ మేరకు పార్వతీపురం పట్టణ సమీపంలోని అగ్రహారం కోనేరు వద్ద భక్తుల సందడి వాతావరణం నెలకొంది. అతి పురాతనమైన మండలంలోని అడ్డాపుశీల కాశీవిశ్వేశ్వరుని ఆలయం, పట్టణంలోని పార్వతీపరమేశ్వరుల ఆలయం, ఎస్ఎన్‌పీలోని శివాలయం, నవిరి కాలనీలో మల్లికార్జున స్వామి ఆలయం, సారికి వీధిలోని శివాలయం, బెలగాంలోని పశుపతినాథ్ బ్రహ్మసూత్ర శివాలయాలకు తెల్లవారు జామునుంచే భక్తులు పోటెత్తారు. ఓం నమఃశివాయ నామస్మరణతో శివాలయాల పరిసరాలు ప్రతిధ్వనించాయి. పెద్దసంఖ్యలోభక్తులు పరమేశ్వరునికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. దైవ సన్నిధానాలు దేదీప్యమానంగా ప్రకాశించాయి. అగ్రహారం శివాలయంలో స్వామివారికి అభిషేకాలతోపాటు రుద్రాభిషేకాలను నిర్వహించారు.


అగ్రహారం శివాలయంలో దీపదానం చేస్తున్న మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ కొండపల్లి రుక్మిణి


బలిజిపేట: గలావల్లి శివాలయం వద్ద క్యూలో భక్తులు


సాలూరు: విశేష పూజలందుకుంటున్న కామాక్షమ్మ ఆలయంలో ఏకామ్రనాథ స్వామి


పశుపతినాథ్ బ్రహ్మసూత్ర శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు